క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



లింగాల: మండలంలోని కోమటికుంటలో నూతనంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్యాలయాన్ని ఆదివారం రాష్ట్ర నాయకుడు రంగినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. గ్రామంలో నాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, వైస్ ఎంపీపీ నారాయణగౌడ్, నాయకులు శ్రీశైలం, ఆనందరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు




పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయనోనిపల్లి మైసమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకొని పిల్లాపాపలను ఆరోగ్యంగా ఉండాలని వేడుకున్నారు. అర్చకులు ఆరు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునట్లు ఆలయ చైర్మన్ తెలిపారు.

వాసవీక్లబ్ సేవలు విస్తరిస్తాం




కల్వకుర్తిరూరల్: అంతర్జాతీయ స్థాయిలో వాసవీక్లబ్ సేవలు మరింత విస్తరింస్తామని క్లబ్ ఇంటర్‌నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్యాన్‌టు డస్క్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్ ఆధ్వర్యంలో దేవాలయానికి వాటర్‌ట్యాంక్, విద్యార్థులకు నోటు పుస్తకాలు, పేద మహిళలకు చీరలు, అంధులకు చేతికర్రల పంపిణీ చేశారు. అనంతరం రమేష్‌బాబు మాట్లాడుతూ సమాజంలోని విభిన్న వర్గాల ప్రజలకు వాసవీక్లబ్ ద్వార సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇంటర్‌నేషనల్ ప్రోగ్రాం కోర్డినేటర్ శ్రీరాములు, రీజియన్ చైర్మన్ శ్రీనివాస్‌రావు, ఉప్పల నర్సింహ, రవి, నర్సింహ, ప్రసాద్, మురళీకృష్ణ, ఇరువెంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వెల్దండ: మండల కేంద్రానికి చెందిన మెకానిక్ పాండు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రరూ.16వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విజేందర్‌రెడ్డి, చిందం కృష్ణయ్య, రామకృష్ణ, జంగయ్యసాగర్, రవి, శ్రీధర్, మల్లేష్, విష్ణు, తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం



వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో మడేలయ్య దేవాలయ నిర్మాణం కోసం ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం మాజీ సర్పంచ్ దార్ల కుమార్ రూ.50వేలు విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలన్నారు. దేవాలయాల అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. పనులను నాణ్యతగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. చంద్రశేఖర్, రమేష్, ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

లెక్చరర్లను నియమించాలి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలకు లెక్చరర్లను నియమించాలని బీజేపీ మండల అధ్యక్షుడు బీమేష్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. లెక్చరర్లను నియమించకపోవడంతో విద్యార్థులు కళాశాలలో చేరేందుకు ఆసక్తి చూపడం లేదని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక స్వావలంబన



ఉప్పునుంతల ఐకేపీ కేంద్రంలో విద్యార్థుల దుస్తులు కుట్టుతున్న మహిళలు

- మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ, శ్రీనిధి రుణాలతో ఐకేపీ ప్రోత్సాహం
- విద్యార్థుల దుస్తులు కుట్టే పనులతో ఉపాధి

ఉప్పునుంతల: మండలంలోని మహిళా సంఘాలకు ఐకేపీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. మహిళా సంఘాల ద్వారా రూ.లక్షల్లో బ్యాంకు లింకేజీ రుణాలు పొందడంతో పాటు శ్రీనిధి, ఇతర పథకాల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు పొందుతూ.. స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. దాంతో పాటు గ్రామసంఘాల ద్వారా ఈ ఏడాది వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొనసాగించి కొంత డబ్బులను పోగు చేసుకున్నారు. ఈ ఏడాది మండలంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే దుస్తులను కుట్టించే పనులను మహిళా సంఘాలకు అప్పగించడంతో వాటిని మహిళలు స్థానిక ఐకేపీలోనే కుట్టించి సకాలంలో అందించారు.

1,857 మంది విద్యార్థులకు దుస్తులు

మండలంలోని దాదాపుగా 30 పాఠశాలలకు చెందిన 1,857 మంది విద్యార్థులకు దుస్తులను కుట్టించే పనులను తీసుకొని టైలరింగ్ నేర్చుకున్న మహిళా సంఘాల మహిళలు ఉపాధి పొందారు. మండలంలో మొత్తం 34 గ్రామైక్య సంఘాలు ఉండగా.. వాటి పరిధిలో 766 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉన్నాయి. 23 వికలాంగుల సంఘాలను కలుపుకొని మొత్తం సంఘాల్లో 8,696 మంది సభ్యురాళ్లు ఉన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 275 మహిళా సంఘాలు బ్యాంకు ద్వారా రూ.24.49 కోట్ల రుణాలు తీసుకున్నారు. దాంతో పాటు శ్రీనిధి పథకం ద్వారా 71 సంఘాలకు చెందిన 231 మంది రూ.2.92 కోట్ల వరకు రుణాలు తీసుకున్నారు. ఆహార ఉత్పత్తుల తయారీ పథకం ద్వారా ఆయా సంఘాలకు చెందిన ఐదుగురు సభ్యురాళ్లకు 35 శాతం సబ్సిడీతో రూ.8.91 లక్షలు రుణం ఇప్పించామని ఐకేపీ ఏపీఎం సైదులు తెలియజేశారు.

దుస్తుల కుట్టుతో ఉపాధి పొందాం..



మండలంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఉచితంగా అందించే దుస్తులను కుట్టు పనులను ఇటీవల మాకు అప్పగించారు. 15 రోజుల్లో అన్ని దుస్తులను ఐకేపీ సెంటర్‌లో కుట్టించి పాఠశాలలకు అప్పగించాం. దాంతో కొంత వరకు కుట్టు పనులు వచ్చే మహిళలం ఉపాధి పొందే అవకాశం లభించింది. ఐకేపీ ద్వారా బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలు బాగానే ఇస్తున్నారు. అన్నింటిని సద్వినియోగం చేసుకుంటున్నాం.

– జంపుల సునీత, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు, ఉప్పునుంతల

రుణాలు సకాలంలో చెల్లిస్తే..



మహిళా సంఘాలు బ్యాంకు నుంచి తీసుకుంటున్న రుణాలను తిరిగి ప్రతినెలా బాగానే చెల్లిస్తున్నారు. శ్రీనిధి రుణాలను తిరిగి చెల్లించడంలోనే అక్కడక్కడ కొంత అలసత్వం వహిస్తున్నారు. రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో చెల్లిస్తే ఆయా సంఘాలకు రుణ పరిమితి పెంచడంతో పాటు ఇతర సంఘాల మహిళలకు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుంది. రుణాలు తీసుకుంటున్న మహిళలు చిరు వ్యాపారాలతో పాటు తమ పిల్లల చదువు కోసం వినియోగించుకొని ఆర్థికంగా ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు.

– సైదులు, ఐకేపీ ఏపీఎం, ఉప్పునుంతల

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

లింగాల: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయం దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు నెలలుగా వంటలు వండే ఏజెన్సీ మహిళలకు వేతనాలు చెల్లించలేదని, అదే విధంగా గుడ్ల బిల్లులు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.10 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, గత ప్రభుత్వం ఇస్తున్న రూ.3 వేల వేతనాలు కూడా ఇంత వరకు ఇవ్వలేదని ఆయన విమర్శించారు. ఏజెన్సీ మహిళలు అప్పులు చేసి విద్యార్థుల ఆకలిని తీరుస్తున్నారని ఆయన వాపోయారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాములమ్మ, ఉపాధ్యక్షురాలిగా సరిత, అలివేల, కార్యదర్శిగా మంగమ్మ, కోశాధికారిగా అచ్చమ్మ సహాయ కార్యదర్శిగా గోరెమ్మను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

ఎస్పీని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న కొల్ల శివమాదిగ

కొల్లాపూర్: మొలచింతలపల్లిలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన దాడి, ఆమె చిన్నమామ నాగన్న హత్యలపై నిర్లక్ష్యంగా వహించిన ఎస్పీని సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొల్ల శివమాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మొలచింతలపల్లిలో పర్యటించారు. దాడి, హత్యకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. చెంచు మహిళపై దాడి జరిగిన ఘటన రెండు వారాల వరకు బయటకు రాలేదని, అదేవిధంగా నాగన్న హత్యను గోప్యంగా ఉంచేందుకు పోలీసులు యతిన్నించారని ఆరోపించారు. దీనికి జిల్లా అధికారులే పూర్తిస్థాయి బాధ్యత వహించాలన్నారు. చెంచుల భూములకు రక్షణ కల్పించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మొలచింతలపల్లిలో చెంచులకు సంబంధించిన భూములపై కనీస అవగాహన కూడా లేని కొల్లాపూర్ తహసీల్దార్‌పై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోని యాదగిరిమాదిగ, ఎంఎస్పీ జిల్లా నాయకులు మంద నర్సింహ్మమాదిగ, నాయకులు బచ్చలకూర లక్ష్మణ్, మీసాల నాగరాజు, కురుమయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీల పదోన్నతులను ప్రత్యక్ష పద్ధతిలో చేపట్టాలి

అచ్చంపేట రూరల్: ఎస్జీటీల పదోన్నతులను ప్రత్యక్ష పద్ధతిలో చేపట్టాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ ముదిరాజ్ కోరారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన తపస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎనిమిది సంవత్సరాల తర్వాత ప్రభుత్వం చేపడుతున్న టీచర్ల పదోన్నతులలో న్యాయం చేయాలని కోరారు. సెకండరీ గ్రేడ్, తత్సమాన ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందేటప్పుడు ఒకటి కన్నా ఎక్కువ సబ్జెక్టులలో ప్రమోషన్ పొందుటకు అర్హత ఉన్న ఉపాధ్యాయులకు మల్టీ జోన్-1లో వారి అర్హతను బట్టి ఒకటి కన్నా ఎక్కువ ప్రమోషన్ ఆర్డర్స్ వచ్చాయన్నారు. ఒకే సబ్జెక్టును ఎంచుకున్న కారణంగా తదుపరి సీనియార్టీలో ఉన్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు ప్రమోషన్ రాకుండా కొన్ని ఖాళీలు అలాగే మిగిలిపోయాయన్నారు. ప్రస్తుతం మల్టీజోన్-2 లో రెండు, మూడు రోజులలో ఎస్జీటీల పదోన్నతులు ప్రారంభం అవుతున్న సందర్భంగా ఒకటి కన్నా ఎక్కువ సబ్జెక్టులలో ప్రమోషన్ పొందే ఉపాధ్యాయులకు ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలన్నారు. సబ్జెక్టు వారీగా సమయాన్ని కేటాయించి ప్రమోషన్ ఇస్తే ఒక ఉపాధ్యాయుడు ఒకే సబ్జెక్టును ఎంచుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. తదుపరి సీనియార్టీ లిస్టులో ఉన్న ఉపాధ్యాయులకు కూడా ప్రమోషన్లు రావడం వల్ల ఖాళీలు భర్తీ అవుతాయన్నారు. ప్రభుత్వం గుర్తించి ప్రత్యక్ష పద్ధతిలో లేదా ఆన్‌లైన్ అయితే సబ్జెక్టు వారీగా సమయాన్ని కేటాయించి పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



ప్రమాదకరంగా ఉన్న స్తంభం

బల్మూర్: మండలంలోని మైలారంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఇనుప చువ్వలు బయటకు కన్పించడంతో ఎప్పుడు కూలుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన స్తంభాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. వర్షాకాలంలో బలంగా ఈదురుగాలలు వచ్చే అవకాశం ఉన్నా అధికారులు స్తంభాన్ని తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ లేదు

గ్రామ సమీపంలోని శివాలయం వద్ద ఆరు నెలల కిందట ఏర్పాటు చేసిన 25 కేవీ వ్యవసాయ బోర్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ నిరుపయోగంగా మారిందని రైతులు విమర్శించారు.

స్తంభాలను మార్చాలి

శిథిలావస్థకు చేరిన స్తంభాలను మార్చాలని మూడేళ్లుగా అధికారులకు విన్నవిస్తున్నాం. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన స్తంభం ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రైతుల వ్యవసాయ బోర్ల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌కు వెంటనే కనెక్షన్ ఇవ్వాలి.

–బుచ్చిరెడ్డి, రైతు మైలారం

నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలను తొలగించి నాలుగు రోజుల్లో కొత్తవి ఏర్పాటు చేస్తాం. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ విషయంలో రైతులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాను.

–సుధాకర్, ఏఈ, బల్మూర్

అసంపూర్తిగా వైకుంఠధామం



అసంపూర్తిగా ఉన్న శ్మశాన వాటిక

తాడూరు: మండలంలోని తుమ్మలసూర్‌లో రూ.లక్షలు వెచ్చించి వైకంఠధామం నిర్మాణ పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. రెండేళ్ల కిందట పనులు ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా మిగిలిన పనులు పూర్తి చేసి ఉపయోగంలోకి తేవాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కలుసుకున్న జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఒకొరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో జగన్, కృష్ణ, గోవర్ధన్‌రెడ్డి, సి గోవర్ధన్, చంద్రమోహన్, శ్రీదేవి, భాస్కర్‌రావు, సుదర్శన్, రవి, శోభన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉద్యాన పంటలపై అవగాహన సదస్సు

కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాల రైతువేదిక ఆవరణలో సోమవారం రైతులకు ఉద్యాన పట్టు పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, పలు విషయాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు రైతు సమన్వయ సమితి మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్‌ఫాంపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన పట్టుపరిశ్రమ అధికారి, వ్యవసాయ శాఖ అధికారులు హాజరవుతారని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చారకొండ: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని జూపల్లి శివారులో చోటు చేసుకుంది. జూపల్లి గ్రామానికి చెందిన బండ్ల లక్ష్మమ్మకు సంబంధించిన గేదె వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యాదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. పశు వైద్య, విద్యుత్‌శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకొని మృతి చెందిన గేదెను పరిశీలించారు. మృతి చెందిన గేదె విలువ సూమారు రూ.80 వేలు ఉంటుందని బాధితురాలు తెలిపారు.

అమ్రాబాద్: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన ఘటన ఆదివారం పదరలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పదరకు చెందిన గిర్ని కృష్ణయ్య పాడి ఆవులు మేతకు వెళ్లి పశువుల పాకకు వస్తున్న క్రమంలో గ్రామం పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు పాడి ఆవు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఆవు విలువ రూ.45 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

అచ్చంపేట రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు మంత్రి పదవి ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ అచ్చంపేట నియోజకవర్గ అధ్యక్షుడు మహబూబ్‌అలీ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్‌లో 20 సంవత్సరాల నుంచి అధికారం లేకున్నా ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన సేవలను గుర్తించి మంత్రి పదవి ఇవ్వాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలు సాధిద్దాం



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కొల్లాపూర్: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలు కొనసాగిస్తామని బీజేపీ మండల అధ్యక్షుడు సాయి కృష్ణగౌడ్ అన్నారు. ఆదివారం ముఖర్జీ వర్ధంతిని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హైందవ ధర్మం కోసం ప్రజలకు జాగృతం చేయడంలో కీలకపాత్రం పోషించారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కేతూరి బుడ్డన్న, కద్దాల కృష్ణ, బాలకృష్ణ, చరణ్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

అదుపు తప్పితే అంతే



తాడూరు నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే రహదారి పక్కన ఉన్న గుంత

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరుపక్కల గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షన లేకపోవడం వల్ల వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రం నుంచి యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్ మీదుగా ఐతోల్‌కు వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు మండల కేంద్రానికి సమీపాన కేబుల్ లైన్ కోసం గుంత తవ్వి వదిలేశారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనే ఉన్న ఈ గుంత ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. అదేవిధంగా మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి ఆర్‌అండ్‌బీ రోడ్డు తాడూరు సమీపంలో కల్వర్టు ధ్వంసం కావడంతోపాటు గుంత ఏర్పడింది. వాహనాలు అదుపు తప్పితే ప్రాణాలు గాల్లో కలిసే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేశారు.

పాఠశాల అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు

లింగాల: ప్రభుత్వ ఆదేశానుసారం, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక శ్రద్ధతో మండల పరిధిలోని కోమటికుంట ప్రాథమికోన్నత పాఠశాల అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు పంపించినట్లు హెచ్‌ఎం అంజిలాల్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలో 7వ తరగతి వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 8వ తరగతి ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దశల వారీగా ఉన్నత పాఠశాలకు అప్‌గ్రేడ్ అవుతుందని వివరించారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: సేవతోనే సంతృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా క్యాంపు కార్యాలయంలో ఆయన అభిమానులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలన్నారు. శిబిరంలో 175 మంది రక్తదానం చేశారు. అనంతరం జ్ఞానసరస్వతీ విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, సతీమణి సరితలు కలిసి దివ్యాంగులకు వీల్ చైర్‌లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. జెడ్పీటీసీ రోహిణి, ఎంపీటీస రేణుక, మల్లయ్య, గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రమేష్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, లింగం, నారాయణ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి సన్మానించారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటారు. సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, బాలగౌడ్, ప్రకాష్, శ్రీనివాసులు, పవన్, రాముడు, స్వామి, సీనియర్ నాయకులు బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీలను తనిఖీ చేసిన పోలీసులు

దోమలపెంట: ఈగలపెంట, దోమలపెంటలో లాడ్జీలను ఈగలపెంట ఎస్ఐ వీరమల్లు శనివారం అర్ధరాత్రి తనిఖీ చేశారు. టూరిజానికి సంబంధించిన హిల్‌టాప్‌లో రూంలను సందర్శించిన ఐడీ కార్డులను పరిశీలించారు. గుర్తింపు కార్డులు ఉన్న వారికే లాడ్జిలో రూంలు కేటాయించాలని ఎస్ఐ నిర్వాహకులకు సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిత కార్యకలాపాలకు పాల్పొడొద్దన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మదనాపురం: ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ నిర్ణయం తీసుకోవడంతో ఆదివారం కాంగ్రెస్ మండల నాయకులు బస్టాండ్ కూడలిలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగన్న నాయకులు అక్కల మహదేవన్ గౌడ్, వెంకట్ నారాయణ, నాగన్నయాదవ్, ఎంపీటీసీ కురుమయ్య, సాయిబాబా, కొండన్న, తిరుపతిరెడ్డి, కృష్ణవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.